# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పట్టాదారు పాస్ పుస్తకాన్ని ఆటో మ్యూటేషన్ అనంతరం నేరుగా ప్రజల ఇంటికే పంపాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనుంది.**

3. **ప్రజల అవసరాల కోసం కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులు ప్రతి పైసా సద్వినియోగం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.**

4. **రాష్ట్రంలోని 13 సంవత్సరాల లోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా ముసాయిదా చట్టాన్ని రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు.**

5. **ప్రభుత్వం సమగ్ర ట్రామా కేర్ పాలసీని రూపొందించిందని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.**

==========================

పట్టాదారు పాస్ పుస్తకాన్ని ఆటో మ్యూటేషన్ అనంతరం నేరుగా ప్రజల ఇంటికే పంపాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భూమే ప్రాణంగా భావించే రైతుల భూ వివాదాలు పరిష్కరించి, వారికి భద్రత, భరోసాను కల్పిస్తామని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రతి నెల 9వ తేదీన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖలో ప్రభుత్వం తెచ్చిన మార్పులు, సంస్కరణలు ప్రజలకు వివరించడంతోపాటు, ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కారం చేసేందుకు యంత్రాంగానికి ఆదేశాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. 2027 మార్చి నాటికి రెండవ దశ రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి 1 కోటి 12 లక్షల పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి నిర్ణయం తీసుకున్నామన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు

కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ చట్టసవరణకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కేబినెట్ ధన్యవాదాలు తెలపనుందని అధికారులు వెల్లడించారు. ఇటీవల పట్టణ, గ్రామ స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో వీటికి ఎన్నికల విషయంపైన చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

---------------------------

ప్రజల అవసరాల కోసం కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులు ప్రతి పైసా సద్వినియోగం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో 19 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 316 పనులు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 150 పనులు పూర్తయి బిల్లుల చెల్లించినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ లాడ్స్ వినియోగంపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 35

---------------------------

పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. విజయవాడలో నిన్న నిర్వహించిన కార్యక్రమంలో పోషణ్ పక్వాడ గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు, రెండు ఏళ్లలోపు చిన్నారులకు సరైన పోషకాహారం, ఆరోగ్యం, విద్యా విషయాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పౌష్టికాహారంతోనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 55 వేల అంగన్‌వాడీ కేంద్రాలలో టీవీలు, ఆటవస్తువులు, శౌచాలయాలు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ఇప్పటికే కల్పించిందని వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలోని 13 సంవత్సరాల లోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడమే లక్ష్యంగా ముసాయిదా చట్టాన్ని రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ అంశంపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. 13 నుండి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు వయసుకు అనుగుణమైన కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర దేశాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని సూచిస్తూ ఆస్ట్రేలియా, సింగపూర్, డెన్మార్క్ వంటి దేశాల విధానాలను పరిశీలించాలన్నారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

---------------------------

రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులను తక్షణమే ఆసుపత్రికి తరలించి వైద్య సాయం అందించేందుకు ప్రభుత్వం సమగ్ర ట్రామా కేర్ పాలసీని రూపొందించిందని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారుల

వెంబడి అవసరమైన అన్ని వసతులతో 109 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ లోని కొండాపూర్‌లో వంద పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అరికపుడి గాంధీతో కలిసి ఆరోగ్యశాఖ మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నూతన పాలసీలో భాగంగా 108–అంబులెన్స్‌ల సంఖ్య పెంచుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31 క్రిటికల్ కేర్ బ్లాకులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

2030 నాటికి దేశంలో ఎయిడ్స్, క్షయ, మీజిల్స్, రుబెల్లా వంటి వ్యాధుల నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి పుణ్య సలీలా శ్రీవాత్సవ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా, మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఆమె నిన్న సమావేశమై రాష్ట్రంలో వైద్య పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుణ్య సలీలా శ్రీవాత్సవ మాట్లాడుతూ.. సంక్రమిత వ్యాదుల కంటే అసంక్రమిత వ్యాధులు దేశంలో ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని నియంత్రించేందుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతూనే ఉండాలని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ఉచిత విద్యుత్ అందించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలో నిన్న నిర్వహించిన చేనేత–జౌళి, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు ఆర్థికంగా ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మగ్గంపై పనిచేసే నేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గం నేత కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. దీంతో మగ్గం కార్మికులకు నెలకు సుమారు 720 రూపాయలు, మరమగ్గం కార్మికులకు వెయ్యి 8 వందల 60 రూపాయల వరకు ఆదా అవుతుందని వివరించారు.

---------------------------

ఒడిశా, పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి  తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉత్తర–దక్షిణ ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలో ఈరోజు, రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా  ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారిణి జి.లక్ష్మీ  తెలియజేస్తూ..

వాయిస్... 18

మరోవైపు తెలంగాణలో రానున్న 5 రోజు పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు కొత్తగూడెం, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట్, వనపర్తి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

=====================